సాక్షి మంచిర్యాల

శనివారం । 20 । మే । 2023



వేతన ఒప్పంద చర్చలు సఫలం

బొగ్గు గని కార్మికుల ఒప్పందంపై శనివారం కోల్‌కత్తాలో జరిగిన 10వ దఫా జేబీసీసీఐ–11 చర్చలు సఫలమయ్యాయి. 25శాతం అలవెన్స్‌ల పెంపునకు అంగీకారం కుదిరింది. 8లో▸



లక్ష పుష్పాభిషేకం

మంచిర్యాలఅర్బన్‌: విశ్వనాథ స్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా వాసవి కన్యాకపరమేశ్వరీ అమ్మవారికి లక్ష పూలతో భక్తులు అభిషేకం చేశారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఈవో ముక్త రవి పాల్గొన్నారు.



గరిష్టం/కనిష్టం
42.0 /28.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళల్లో మేఘావృతమై ఉంటుంది. ఆగ్నేయం దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

మాతాశిశు మరణాలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్‌: జిల్లాలో మతాశిశు మరణాలు లేకుండా వైద్యులు, సిబ్బంది చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్‌ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రసూతి మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కుందారం పీహెచ్‌సీలో ఈ ఏడాదిలో రామారావుపేట్‌కు చెందిన ఎస్‌.సంగీత, కుందారం గ్రామానికి చెందిన నర్మద మాతృమరణాలు ఎందుకు సంభవించాయని ప్రశ్నించారు. ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీ వైద్యుల ద్వారా సరైన సమయంలో వైద్యం అందించాలని, ప్రతీ గర్భిణికి అన్ని పరీక్షలు చేయించాలని తెలిపారు. మాతాశిశు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ నీరజ, డీఎస్‌వో డాక్టర్‌ ఫయాజ్‌ఖాన్‌, డాక్టర్‌ శ్రావణి, మాస్‌ మీ డియా అధికారి బుక్క వెంకటేశ్వర్‌, ఏఎన్‌ఎంలు ఉమారాణి, కృష్ణవేణి, ఆశాలు సుమలత, సునిత, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌ క్విజ్‌లో పాల్గొనండి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాలటౌన్‌: రాజీవ్‌గాంధీ యూత్‌ ఆన్‌లైన్‌ క్విజ్‌ కాంపిటీషన్‌లో జిల్లా యువత పాల్గొనాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజీవ్‌ గాంధీ యూత్‌ డిక్లరేషన్‌ సందర్భంగా క్విజ్‌ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 7661899899 నంబర్‌కు మిస్డ్‌ కాల్‌ ఇస్తే రిజిస్ట్రేషన్‌ లింక్‌ మొబైల్‌కు వస్తుందని తెలిపారు. విజేతలకు నియోజకవర్గంలో మొదటి బహుమతి ల్యాప్‌టాప్‌, రెండో బహుమతి స్మార్ట్‌ఫోన్‌, మూడో బహుమతి ట్యాబ్‌, ప్రతీ అసెంబ్లీలో 40 కన్సోలేషన్‌ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతీ అసెంబ్లీలోని ఒక మహిళకు ఒక ఎలక్ట్రిక్‌ స్కూటీని ఇవ్వనుండగా, జూన్‌ 2న పరీక్ష నిర్వహిస్తున్నారని, వివరాలకు https://www.rajivgandhiyouthquiz. com వెబ్‌సైట్‌ చూడాలని కోరారు.

ఆశావర్కర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

జన్నారం: జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కిష్టాపూర్‌ ఆశా వర్కర్‌పై ఏఎన్‌ఎం దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా ఆశావర్కర్ల యూనియన్‌ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. టీఆర్‌ఎస్‌ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షురాలు కే.విజయ, కార్యదర్శి వాణి, జిల్లా కమిటీ సభ్యురాలు శ్యామల మాట్లాడుతూ ఏఎన్‌ఎం, ఆమె భర్త ఆశావర్కర్‌ భీంబాయిని బెదిరించడమే కాకుండా చెయ్యి చేసుకున్నారని ఆరోపించారు. ఏఎన్‌ఎం, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఉమాశ్రీ చెప్పడంతో ధర్నా విరమించారు. టీఆర్‌ఎస్‌కేవీ మండల అధ్యక్షురాలు లీలా, హాజీపూర్‌ మండల అధ్యక్షురాలు పద్మ, కార్యదర్శి సునీత, దండేపల్లి మండల అధ్యక్షురాలు, కార్యదర్శి సువర్ణ, మంజుల, నస్పూర్‌ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంధ్య, పద్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఆర్‌ఆర్‌ఆర్‌



న్యాయమూర్తితో చైర్‌పర్సన్‌, మున్సిపల్‌ సిబ్బంది

బెల్లంపల్లి: బెల్లంపల్లి జూనియర్‌ సివిల్‌ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం మున్సిపల్‌ ఆధ్వర్యంలో రెడ్యూజ్‌, రీయూజ్‌ రీసైక్లింగ్‌(ఆర్‌ఆర్‌ఆర్‌) కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి ముకేష్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జక్కుల శ్వేత కమిషనర్‌ కె.సమ్మయ్య కోర్టు పరిసరాల్లో మొక్కలు నాటారు. మున్సిపల్‌ పారిశుధ్య సిబ్బంది చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పట్టపగలే హత్యలు !

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పట్టపగలు.. అందరూ చూస్తుండగానే జరుగుతున్న హత్యలు మంచిర్యాల జిల్లాలో కలకలం రేపుతున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో ప్రశాంత వాతావరణంలో అశాంతి రేపుతున్నాయి. వ్యకిగత కక్షలు, ఆస్తి పంపకాలు, భూముల తగాదాలతో మనుషుల ప్రాణాలనే తీస్తున్నారు. ఈ ఘటనలతో ఓ వైపు మృతుల కుటుంబాల్లో విషాదం నింపుతుండగా మరో వైపు ప్రత్యర్థులు కేసులు, జైలు పాలవుతున్నారు. సమాజంలోనూ అశాంతికి కారణమవుతున్నాయి. జిల్లాలో నేర ప్రవృత్తి పెరిగిపోతుండడంతో వీటి ప్రభావం విభిన్న వర్గాలపై పడుతోంది. ఇలాంటి హత్యలను ఆదిలోనే నిర్మూలించాల్సిన అవసరం ఉంది.



రోదిస్తున్న స్వప్న కుటుంబ సభ్యులు

- మంచిర్యాల జిల్లాలో పెరిగిపోతున్న నేరప్రవృత్తి
- తాజాగా మహిళ హత్య ఘటనలో ఇదే తీరు
- అందరూ చూస్తుండగానే దారుణం

చంపడమే మార్గమా?

చాలా ఘటనల్లో మనుషులను చంపడమే? మార్గంగా భావిస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన ఘటనలు పరిశీలిస్తే తమ ప్రత్యర్థులను మట్టుబెట్టడంతోనే పైచేయి సాధిస్తామనే విపరీత ధోరణి పెరిగిపోతోంది. ఈ కారణంగానే మనుషులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్‌ 16న మందమర్రి మండలం గుడిపల్లిలో ఓ మహిళ తన భర్తపై కోపంతో ఇంటికి నిప్పు పెట్టించడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా అందరినీ ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఇటీవల కాలంలోనూ విపరీత బుద్ధి పెరుగుతూ వస్తోంది. మనుషులను చంపడమే మార్గం అనే స్థాయికి వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వీటిని నిర్మూలించేందుకు పోలీసు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. నేరం చేస్తే తర్వాత జరిగే పరిణామాలను అందరికీ అర్థమయ్యేలా వివరించాల్సి ఉంది.

పథకం వేసి దారుణాలు

- గత మార్చి 15న మందమర్రి మండలం మామిడిగట్టుకు చెందిన సల్లూరి అంజలి(21)పై నెన్నెల మండలం మన్నెగూడ నివాసి పెరుగు మహేశ్వరీ కత్తితో దాడి చేసి హత్య చేసింది. ఇద్దరు యువతుల మధ్య సాన్నిహిత్యం చివరకు ఈ దారుణానికి దారి తీసింది. ముందస్తు పథకం ప్రకారం యువతిని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దాడికి ఒడిగట్టింది.
- గత నెల 11న ఉదయం 11.15గంటలకు జిల్లా కేంద్రానికి సమీపం రామక్రిష్టాపూర్‌ పరిధి గద్దె రాగిడిలోని చాకలి వాడలో రియల్‌ వ్యాపారి నడిపెల్లి లక్ష్మీకాంతారావు(63) దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థల వివాదంలో గత కొంతకాలంగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పక్కాగా ప్లాన్‌ వేసి ఆయనను ప్రత్యర్థులు హత మార్చారు.
- గత నెల 25న ఉదయం 8.10గంటల ప్రాంతంలో జైపూర్‌ మండలం ఇందారంలో ఉనజీర్‌పల్లికి చెందిన ముస్కే మహేశ్‌(25) ను అదే గ్రామానికి చెందిన ఓ యువతితో సంబంధం నెరుపుతూ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నాడని అందరూ చూస్తుండగానే బండరాయి, కత్తితో దాడి చేస్తూ దారుణంగా చంపేశారు. ఈ ఘటనలో ఆ యువతి తల్లితండ్రులతో సహా తమ్ముడు ప్రధాన నిందితులుగా ఉన్నారు.

అవగాహన లోపమే



చట్టాల పట్ల ఇప్పటికీ చాలామందికి అవగాహన లేదు. తప్పు చేస్తే శిక్షలు ఉంటాయనే విచక్షణ కోల్పోతున్నారు. తప్పు చేస్తే జరిగే పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి. జిల్లాలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే అక్రమ సంబంధాలు, ఆర్థిక, భూ తదితర సమస్యలతో మనుషుల్లో మానసిక స్థితి పట్టుతప్పుతోంది. వీటిని నిర్మూలించేందుకు అందరం కృషి చేయాలి.

– అంబాల సమ్మయ్య, మానసిక నిపుణులు

- తాజాగా శుక్రవారం జిల్లా కేంద్రం మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌లో ఉంటున్న స్వప్న(27)ను ముగ్గురు వ్యక్తులు దారుణంగా కత్తితో దాడి చేసి చంపేశారు. పట్టపగలు అందరూ చూస్తుండగానే ఈ దారుణం జరిగింది. గత కొంతకాలంగా స్వప్న తన రెండో భర్త కుటుంబంతో భూమి విషయంలో గొడవ జరుగుతోంది. దీంతో పథకం వేసి చంపాలనుకుని నిర్ణయించుకుని మాజీ భర్త, మామ, మరిది కలసి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

వీఆర్‌ఏలకు పే స్కేల్‌



లక్సెట్టిపేటలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

- కేబినెట్‌ నిర్ణయంతో ఉద్యోగుల హర్షం
- జిల్లాలో 523మంది సిబ్బందికి లబ్ధి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పదేళ్లుగా పే స్కేల్‌ లేకుండా పని చేస్తూ ఉద్యోగ భద్రత కోసం పోరాటం చేసిన వీఆర్‌ఏ(గ్రామ రెవెన్యూ సహాయకులు)లకు ఎట్టకేలకు ఊరట కలిగింది. గురువారం రాష్ట్ర కేబినేట్‌ వీఆర్‌ఏలకు పే స్కేల్‌ వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లా ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వీఆర్‌ఏలను శాశ్వత ఉద్యోగులు ప్రకటించడంపై శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం 523మంది వీఆర్‌ఏలు పని చేస్తున్నారు. ఇందులో 2012, 2014లో పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించిన రాత పరీక్షతో 46మంది నియామకం అయ్యారు. మిగతా వారు పూర్వం నుంచే గ్రామాల్లో రెవెన్యూ అధికారులకు సహాయకులుగా పని చేస్తున్నారు. ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రక్షాళనలో భాగంగా వీఆర్వో(గ్రామ రెవెన్యూ అధికారి) వ్యవస్థను రద్దు చేసింది. దీంతో కింది స్థాయిలో పని చేస్తున్న వీఆర్వోలకు ప్రమోషన్‌ ఛానల్‌ లేకుండా పోయింది. ఆందోళన చేయడంతో తాత్కాలికంగా వీఆర్వోలను వివిధ శాఖలో సర్దుబాటు చేస్తామని చెప్పినా చేయలేదు. దీంతో వీఆర్‌ఏలకు స్పష్టమైన జాబ్‌ చార్ట్‌ లేకుండానే పని చేస్తున్నారు. తమకు ఉద్యోగ భద్రత కరువైందని ఆందోళన చేపట్టారు. గత ఏడాది జూలై నుంచి సెప్టెంబర్‌ వరకు 80రోజులపాటు విధులకు దూరంగా ఉండి సమ్మె చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదు. దీంతో చివరకు ఆందోళన విరమించారు.

పలుశాఖల్లో సర్దుబాటు

గ్రామ సేవకులుగా ప్రత్యక్ష నియామకాలతోపాటు ఎన్నో ఏళ్ల అటెండర్లు, స్వీపర్లు, సుంకరీ, తదితర హోదాల్లో పని చేస్తున్న గ్రామ సేవకులు ఉన్నారు. గ్రామాల్లో రెవెన్యూ పరిధితోపాటు అభివృద్ధి, సంక్షేమ, పౌరులకు అనేక రకాల సేవలు చేస్తున్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దు చేయడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిని రెవెన్యూ శాఖ కాకుండా విద్యా, వైద్యం, మిషన్‌ భగీరథ, మున్సిపల్‌, సాగునీటి తదితర శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు. వీరిలో కొందరు డైరెక్టు నియామకం పొందిన వారి విద్యార్హత ఉన్న వారిని రెవెన్యూ శాఖలోనే జూనియర్‌ అసిస్టెంట్‌ హోదా కల్పించే అవకాశం ఉంది. దీంతో ప్రస్తుతం అందుతున్న గౌరవ వేతనం రూ.10,500ఉండగా, తాజాగా పే స్కేల్‌ వర్తింపజేస్తే, బేసిక్‌ పే ప్రకారం కనీసం రూ.19వేలు జీతంగా అందనుంది.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



పదేళ్లుగా చాలీచాలని వేతనాలకు పని చేశాం. ఇన్నాళ్లకు మాకు పే స్కేల్‌ వర్తింపజేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్‌ 2లోపు విధి విధానాలపై జీవో వస్తే మరింత సంతోషం.

– దుర్గం శ్రీనివాస్‌, వీఆర్‌ఏ జేఏసీ, కన్వీనర్‌, మంచిర్యాల జిల్లా

ఉపసంహరణ.. ఇబ్బందికరమే..!

- పెద్ద నోటు విషయంలో ఆర్బీఐ నిర్ణయంపై ప్రజల మనోగతం
- రూ.2వేల నోట్ల మార్పిడికి నాలుగు నెలల గడువు



మంచిర్యాలఅగ్రికల్చర్‌: రూ.2వేల నోటును ఆర్బీఐ ఉపసంహరించుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నోట్లు రద్దు చేసి ఎలాంటి ఉపయోగం లేకపోగా.. మరోమారు రద్దు చేస్తే ఎలాంటి ప్రయోజనం ఉంటుందని వ్యాపారులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, రైతులు పెదవి విరుస్తున్నారు. ఈ నిర్ణయం ఇబ్బందికరమేనని వాపోతున్నారు. రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరణకు ఆర్బీఐ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ప్రజల వద్ద ఉన్న నోట్లను మే 23 నుంచి సెప్టెంబర్‌ 30 వరకు బ్యాంకుల్లో మార్చుకునే అవకాశం కల్పించింది. రోజుకు ఒకసారి రూ.20 వేల చొప్పున మార్చుకునే, లేదా డిపాజిట్‌, ఖాతాలో జమ చేసుకునే వెసులుబాటు కల్పించింది. నాలుగు నెలల సమయంలో బ్యాంకుల వద్ద వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

ఆరేళ్ల తర్వాత మళ్లీ..

నల్లధనం బయటకు వస్తుందని కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్‌ 8న రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసింది. దీంతో ప్రజలు, వ్యాపారులు నిల్వ ఉన్న నోట్ల మార్పిడికి బ్యాంకుల్లో బారులు తీరారు. పెద్ద నోట్లు పెట్రోల్‌, డీజిల్‌, ఇతర సరుకులు, గ్యాస్‌, కరెంట్‌ బిల్లులు, గృహసామగ్రి కొనుగోళ్లు, సినిమా థియేటర్ల వద్ద తీసుకోకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నోట్లు డిపాజిట్‌ చేయడం, నగదు, విత్‌డ్రా కోసం రోజుల తరబడి తిప్పలు పడ్డారు. ఇప్పటికే రూ.2వేల నోట్లు ఏటీఎంల్లో కానీ, సామాన్య, పేద ప్రజల వద్ద గానీ కొంతకాలంగా కనిపించడం లేదు. వ్యాపారులు పెద్దమొత్తంలో నగదు లావాదేవీలు సాగించే వారి వద్దనే ఉంటున్నాయి.

రియల్‌ వ్యాపారులకు దెబ్బ

జిల్లాలో రియల్‌ ఎస్టేట్‌ వ్యవహారాల్లో రూ.2వేల నోట్ల చలామణి ఎక్కువగా ఉంటోంది. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు రూ.లక్షల్లో లావాదేవీలు నిర్వహిస్తుండడంతో పెద్ద నోట్లు లేక ఇక్కట్లు ఎదురవుతాయని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు వేతనాలు తీసుకుంటున్న సమయంలో కొన్ని రూ.2వేల నోట్లు వస్తున్నాయి. పంట విక్రయించిన రైతులకు వ్యాపారులు నోట్లు ఇస్తున్నారు. ఉపసంహరణ నిర్ణయంతో కొంత ఇబ్బంది పడక తప్పేలా లేదని వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు.

ఎవరికి ఉపయోగం..



గతంలో నల్లధనం బయటకు తీస్తామని రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేశారు. ఎలాంటి నల్లధనం బయటకు రాలేదు. ఇప్పుడు రూ.2 వేల నోట్లను రద్దు చేస్తున్నారు. దీనివల్ల ఎవరికి ఉపయోగం ఉంటుంది. ఏమైనా అవసరాల కోసం కూడబెట్టిన నోట్లు మార్చుకునేందుకు మరోమారు కార్మికులు ఇబ్బందులు పడుడు తప్పా ఏమి ఉపయోగం ఉండదు.

– తోట మహేష్‌, శ్రీరాంపూర్‌, సింగరేణి కార్మికుడు

నోటు చూడక ఏడాదైంది..



ఏడేళ్ల కిందట వెయ్యి నోటు, 500 నోటు బంద్జై, రెండు వేల నోటు, కొత్తగా ఐదు, రెండు వందల నోట్లు వచ్చినయి. కానీ ఏడాది కాలంగా రెండు వేల నోటు కనిపించడం లేదు. పత్తి, వడ్లు అమ్మినా రూ.500 నోట్లే ఇస్తున్నారు. లేదంటనే అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్‌ అంటున్నారు. నోట్లు ఉన్న ఒక్కటే లేకున్నా ఒక్కటే పెద్ద పెద్దోళ్ల దగ్గరనే పెద్ద నోట్లు ఉంటున్నాయి.

– కొండు బాపు, నెన్నెల, రైతు


ఎక్కువగా డిజిటల్‌ పేమెంట్‌



కొత్తగా రెండు వేల నోటు వచ్చినప్పుడు 2021 వరకు నోట్లు ఎక్కువగా దుకాణానికి వచ్చేవి. కష్టమర్ల దగ్గర, రెండు వేల నోటు మార్కెట్లో గత కొన్ని నెలల నుంచి కనిపించడం లేదు. ఎక్కువగా రూ.500 నోట్లు, లేదా ఫోన్‌పే, గూగుల్‌ పేనే ఉంటున్నాయి. కొంత నిల్వ ఉన్నా మార్చుకునేందుకు నాలుగు నెలల గడువు ఇవ్వడం మేలు జరుగుతుంది.


– ముర్కూరి బాలకిషన్‌; బెల్లంపల్లి, వ్యాపారి

ఆర్బీఐ నిర్ణయం సరికాదు



బెల్లంపల్లి: రూ.2 వేల నోట్లను రిజర్వు బ్యాంకు ఆకస్మికంగా ఉపసంహరించుకోవడం సరికాదు. చిరు వ్యాపారులు, పేద, సామాన్యులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. గతంలో నోట్లను ఆకస్మికంగా రద్దు చేయడంతో కరెన్సీ కోసం ప్రజలు ఎన్నో పాట్లు పడ్డారు. తాజాగా రిజర్వుబ్యాంకు అదే తరహాలో నిర్ణయం తీసుకుని ప్రజలను ఇరకాటంలో పెట్టినట్లే అవుతుంది. గడువు ఇచ్చినా ప్రజలు ఏదో తీరుగా ఇబ్బంది పడక తప్పని పరిస్థితులు ఉంటాయి. వ్యాపారులకు సంకట పరిస్థితులు ఏర్పడుతాయి. – బాల సతీష్‌ , కిరాణ వ్యాపారి, బెల్లంపల్లి

చాలా రోజుల క్రితమే ప్రచారం జరిగింది..



బెల్లంపల్లి: రూ.2వేల నోట్ల రద్దు నిర్ణయాన్ని ఆర్‌బీఐ ఎందుకు తీసుకుందో ప్రకటించలేదు. ఆర్‌బీఐ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాను. పదే పదే నోట్లను రద్దు చేయడం వల్ల దేశ ప్రయోజనాలు ఏమైనా ఇమిడి ఉన్నా పౌరులకు మాత్రం ఇబ్బందికరమే అవుతుంది. కరెన్సీ చలామణిపై ఆర్‌బీఐ కానీ కేంద్ర ప్రభుత్వం కానీ సహేతుకమైన విధానాన్ని అనుసరించడం లేదనిపిస్తోంది. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంచలన నిర్ణయాల పేరుతో ప్రజల ఓపికను పరీక్షిస్తోంది. వాస్తవానికి ఇప్పటికే రూ.2వేల నోట్లు మార్కెట్‌లో అంతగా చలామణి కావడం లేదు. చాలారోజుల క్రితమే రూ.2వేల నోటును రద్దు చేస్తారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు వాస్తవమైంది. – సోకాల శ్రీనివాస్‌, సింగరేణి కార్మికుడు, బెల్లంపల్లి

బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్యపై ఫ్లెక్సీల కలకలం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై హైదరాబాద్‌లో శుక్రవారం వెలిసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. ఆరిజిన్‌ డెయిరీ పేరుతో హైదరాబాద్‌లో దాదాపు 26 చోట్ల ఫ్లెక్సీలు కట్టారు. అక్కడ కట్టి న ఫ్లెక్సీల వ్యవహారం బెల్లంపల్లి సోషల్‌ మీడియాలో వైరలైంది. ఎమ్మెల్యే మోసం చేశాడని ఆరోపిస్తూ గుర్తు తెలియని వ్యక్తులు ఆరిజిన్‌ డెయిరీ పేరు రాసి ఫ్లెక్సీలు ప్రదర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ న్యాయం చేయాలని వేడుకున్నారు.

జాబ్‌మేళాలో 35 మంది ఎంపిక

మంచిర్యాలఅర్బన్‌: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్‌, నాలెడ్జి సెంటర్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఎంపికయ్యారు. 2019 నుంచి 2023 సంవత్సరంలో డిగ్రీ పాసైన విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు 35 మంది ఉద్యోగమేళాలో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్‌ చక్రపాణి తెలిపారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్‌ రామక్రిష్ణ, పది బహుళజాతి కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

తడి, పొడి సాగు విధానం లాభదాయకం

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): వరి సాగులో తడి, పొడి విధానాలను అనుసరించడం ఎంతో లాభదాయకమని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం హాజీపూర్‌ మండలం గుడిపేట రైతువేదికలో కోర్‌ కార్బన్‌ ఎక్స్‌ సొల్యూషన్స్‌ ఆధ్వర్యంలో వరిసాగులో తడి, పొడి పద్ధతులపై రైతులు, వ్యవసాయాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని, ఈ క్రమంలో నీటిసామర్థ్యం, యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. వరి సాగుకు నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించడానికి తడి, పొడి పద్ధతిలో వరిసాగు లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. సీసీఎక్స్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ నర్సింహారెడ్డి మాట్లాడుతూ తడి, పొడి సాగు విధానంలో 30 శాతం వరకు నీటి వినియోగం తగ్గుతుందని, వరిసాగులో వేరు వ్యవస్థ చాలా అభివృద్ధి చెంది, చేను కింద పడిపోదని, చీడపీడలు, దోమకాటుకు గురికాకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కల్పన, పీఏసీఎస్‌ చైర్మన్‌ సందెల వెంకటేశ్‌, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజ్‌, మాజీ వైస్‌ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌, నాయకులు దొమ్మటి లచ్చన్న, దొమ్మటి బాపు, రెయిడ్స్‌ ఎన్‌జీఓ డైరెక్టర్‌ మనోహర్‌, జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



మద్దికల్‌లో నీటినిల్వల పరిశీలన

భీమారం: గ్రామాల్లో జ్వరాలకు ప్రధాన కారణమైన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దికల్‌, ఆరెపల్లి గ్రామాల్లో పర్యటించి డ్రై డే సందర్భంగా దోమల నివారణ చర్యలను పరిశీలించారు. ఆరెపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు. మద్దికల్‌లో తునికాకు కూలీలతో మాట్లాడి రోజుకి ఎంత సంపాదిస్తున్నారని తెలుసుకున్నారు. జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

సంక్షేమ గురుకుల విద్యార్థికి సన్మానం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సీఓఈ గురుకుల పాఠశాల విద్యార్థి కొండగొర్ల సిద్ధార్థను జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శుక్రవారం సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించినందుకు అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. సీఓఈ ప్రిన్సిపాల్‌ ఐనాల సైదులు, వైస్‌ ప్రిన్సిపాల్‌ కోట రాజ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ పోటీల ఏర్పాట్ల పరిశీలన

రామకృష్ణాపూర్‌: పట్టణంలోని సింగరేణి ఠాగూర్‌ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న సీఎం కప్‌ జిల్లా స్థాయి పోటీల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శుక్రవారం పరిశీలించారు. డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి, క్యాతనపల్లి మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటనారాయణ, బీఆర్‌ఎస్‌ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, క్రీడా సంఘాల కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ముల్కల్ల నుంచి గఢ్‌పూర్‌కు వెళ్లే దారిలో ఉన్న కుంటలో తామర పుష్పాలు పరుచుకున్నాయి. కుంట నిండా తామర పుష్పాలతో పచ్చదనం పరుచుకుని చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, మంచిర్యాల

క్లుప్తంగా

వడదెబ్బతో ఒకరి మృతి


కనకయ్య (ఫైల్)

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన పందిర్ల కనకయ్య (57) శుక్రవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకయ్య దమ్మిరెడ్డిపేటలో తన కొడుకు అరుణ్ కౌలుకు తీసుకున్న మామిడి తోటకు ఉదయం వెళ్లి మధ్యాహ్నం 3గంటలకు ఇంటికి వచ్చాడు. దాహం వేస్తుందని, కళ్లు తిరిగినట్లవుతుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. నీళ్లు తాగిన తర్వాత వాంతులు, విరోచనాలయ్యాయి. కొద్దిసేపటి తర్వాత అపస్మారక స్థితికి వెళ్లి మృతి చెందాడు. మృతుడికి భార్య మారక్క, కూతురు శైలజ, కుమారుడు ఉన్నారు.

హార్వెస్టర్ దగ్ధం


కాలిపోయిన హార్వెస్టర్

కోటపల్లి: మండలంలోని బొప్పారం గ్రామంలో ప్రమాదవశాత్తు హార్వెస్టర్ కాలిపోయింది. బొప్పారం గ్రామానికి చెందిన రైతు సుధాకర్‌రెడ్డి వరి కోసేందుకు కరీంనగర్ జిల్లా నుంచి హార్వెస్టర్ తెప్పించాడు. శుక్రవారం తెల్లవారుజామున వరికోసే ముందు మరమ్మతుల్లో భాగంగా మిషన్‌కు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాప్తించాయి. సమీపంలోని వారంతా ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. వెంటనే స్థానిక సర్పంచ్ జెల్ల సతీశ్ పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునేలోపే హార్వెస్టర్ పూర్తిగా కాలిపోయింది.

కులం పేరుతో దూషించిన నలుగురిపై అట్రాసిటీ కేసు

జన్నారం: కులం పేరుతో దూషించి, భయపెట్టిన నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కిష్టాపూర్ గ్రామ ఆశ కార్యకర్త భీంబాయిని అదే ఆస్పత్రిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు పద్మ, కల్పన, మాధవితోపాటు పద్మ భర్త శ్రీనివాస్ కులం పేరుతో దూషించారు. భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో భీంబాయి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

వైద్యం.. దైన్యం


బెల్లంపల్లి సింగరేణి ఏరియాస్పత్రి భవనం

బెల్లంపల్లి: బొగ్గుగని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సరైన వైద్యం అందడంలేదు. బెల్లంపల్లి కేంద్రంగా ఏర్పాటు చేసిన సింగరేణి ఏరియాస్పత్రి తీరు నానాటికీ దిగజారిపోతోంది. ఒకప్పుడు ఓ వెలుగువెలిగిన ఈ ఆస్పత్రి నిర్వహణ సరిగా లేదు. ఏరియాలో బొగ్గు గనులు అంతరించిపోతున్నట్లే ఈ ఆస్పత్రిలో సేవలు కూడా తగ్గిపోతున్నాయి. 1987లో 250 పైచిలుకు పడకల సామర్థ్యంతో ప్రారంభించిన ఏరియాస్పత్రిలో ప్రస్తుతం పలు వార్డులు ఎత్తివేశారు. పడకల సామర్థ్యాన్నీ 75కు కుదించినట్లు తెలుస్తోంది. స్పెషలిస్ట్ వైద్యుల నియామకం లేక రోగులకు మెరుగైన సేవలు అందడంలేదు. ప్రస్తుతం పని చేస్తున్న వైద్యుల్లో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడానికి ఉద్యోగానికి రాజీనామా చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని రకాల వసతులతో ఏరియాస్పత్రిని నిర్మించగా సరైన సేవలు అందడంలేదని కార్మిక కుటుంబాలవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- బెల్లంపల్లి సింగరేణి ఏరియాస్పత్రిలో పూర్తి స్థాయిలో అందని సేవలు
- భర్తీ కాని వైద్యులు, సిబ్బంది పోస్టులు
- ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్న వైనం
- కార్మికులకు అందని మెరుగైన వైద్యం

ప్రథమ చికిత్స చేసి ఇతర ఆస్పత్రులకు..

ఏరియాస్పత్రి నిర్వహణ అంతంత మాత్రంగా ఉండగా వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్ల క్రితం రోజుకు గరిష్ఠంగా 500 మందికి తగ్గకుండా ఔట్ పేషెంట్లు రాగా, 25మందికి తగ్గకుండా ఇన్‌పేషెంట్లు ఉండేవారు. ప్రస్తుతం రోజుకు 200 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తుండగా కనిష్ఠంగా ఐదుగురికి మించకుండా ఇన్‌పేషెంట్లు చేరుతున్నట్లు తెలుస్తోంది. సాధారణ రోగులతో పాటు ప్రమాదకర పరిస్థితులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో వచ్చే రోగులను అనివార్యంగా బీ జోన్, గోదావరిఖని ఏరియా ఆస్పత్రులతోపాటు సింగరేణి కంపెనీతో ఒప్పందం చేసుకున్న కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాల్లోని పలు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. స్థానికంగానే వైద్యం అందించాల్సి ఉండగా ప్రథమ చికిత్స చేసి దూరప్రాంతాలకు పంపడం పరిపాటిగా మారింది. దీంతో వేరే ప్రాంతాలకు వెళ్లి రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్పెషలిస్ట్ వైద్యులు లేక ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నట్లు రోగులు చెబుతున్నారు.

మూడేళ్లుగా నిలిచిన ప్రసూతి సేవలు

ప్రసూతి సేవలకు బెల్లంపల్లి ఏరియాస్పత్రి ఎంతో ప్రసిద్ధిగాంచింది. రోజుకు గరిష్ఠంగా ఆరుకు తగ్గకుండా ప్రసూతి కేసులు నమోదవుతుండేవి. మూడేళ్లుగా ఇక్కడ ప్రసవాలు జరగడం లేదు. కరోనా వైరస్ ప్రబలక ముందే అప్పటివరకు ఇక్కడ పని చేస్తున్న గైనకాలజిస్ట్‌ను మరో ప్రాంత ఏరియాస్పత్రికి పంపించారు. ఆ తర్వాత కరోనా వైరస్ ప్రభావం ఉండడం, గైనకాలజిస్ట్‌ను నియమించకపోవడంతో ప్రసవాలు జరగడంలేదు. మూడు నెలల క్రితం గైనకాలజిస్ట్‌ను నియమించినా ఆపరేషన్ థియేటర్ మరమ్మతు కొనసాగుతోంది. దీంతో గర్భిణులను బీ జోన్, గోదావరిఖని ఆస్పత్రులకు పంపిస్తున్నారు. తాజాగా మత్తు డాక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇతను రాజీనామా చేస్తే గైనకాలజిస్ట్ ఉన్నా ఉపయోగం లేని పరిస్థితులు నెలకొననున్నాయి.

ఏళ్లు గడిచినా స్పెషలిస్ట్ వైద్యులేరి?

ఏరియాస్పత్రికి స్పెషలిస్ట్ వైద్యుల అవసరం ఎంతగానో ఉన్నా భర్తీ చేయడం లేదు. డెర్మటాలజిస్ట్, డెంటిస్ట్, చెస్ట్ ఫిజీషియన్, న్యూరో, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ వైద్యులను నియమించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా సానుకూలంగా స్పందించడం లేదు. ప్రస్తుతం ఆస్పత్రిలో 13 మంది వైద్యులు ఉండగా మరో తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది సమస్య ఉంది. కీలకమైన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. రోగులకు ఇబ్బంది కలగకుండా స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బందిని నియమించి మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నాయి.

చికిత్సకు వస్తే రెఫర్ చేస్తున్నరు

ఆరోగ్యం సరిగా లేక ఏరియాస్పత్రికి వెళ్తే చికిత్స చేస్తలేరు. నాలుగైదు రోజులకు సరిపడా మందులిచ్చి పంపుతున్నరు. నయంగాక మళ్లీ పోతే బీ జోన్, గోదావరిఖని ఆస్పత్రులకు పంపిస్తున్నరు. గంత దూరం పోనని చెప్పినా వింటలేరు. గింత పెద్ద ఆస్పత్రి ఉండగా వేరే ఆస్పత్రులకు పంపుడేందో అర్థమైతలేదు.
– మల్లయ్య, గని కార్మికుడు

ఎమర్జెన్సీ కేసులనే రెఫర్ చేస్తున్నాం

ఏరియాస్పత్రిలో రోగులకు తగిన సేవలందిస్తున్నాం. ఎమర్జెన్సీ కేసులను మాత్రమే ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నాం. వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులను కోరుతున్నాం. ఆపరేషన్ థియేటర్‌కు మరమ్మతులు జరుగుతున్నాయి. పనులు పూర్తికాగానే వినియోగంలోకి తీసుకువస్తాం. – శౌరి, డీవైసీఎంవో, ఏరియాస్పత్రి, బెల్లంపల్లి

ఇంధనశక్తిని పొదుపుగా వాడుకోవాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఇంధనశక్తిని పొదుపుగా వాడుకోవాలని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ వీటీసీలో మిషన్‌లైఫ్ అవగాహన సదస్సు నిర్వహించగా జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పలు అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇంధనశక్తిపై అవగాహన సదస్సు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లోనే వాహనాలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌ఖాదిర్, ఇన్‌చార్జి ఎస్వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, వర్క్‌షాప్ ఎస్ఈ సతీశ్‌చక్రవర్తి, వీటీసీ ఎస్వోఎం రామారావు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హన్మాన్‌గౌడ్ పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన బొగిరె శ్యాంరావు గుడుంబా విక్రయిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఇంట్లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు అతడి ఇంట్లో తనిఖీ చేయగా 10 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధి వేటలో ఆగిన ఊపిరి

- గల్ఫ్‌లో గుండెపోటుతో కవ్వాల్‌వాసి మృతి

జన్నారం: మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన అంబటి అనంతయ్య (54)గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతయ్య ఉపాధి కోసం 15 ఏళ్లుగా ఒమన్ దేశం వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి ఇటీవల తిరిగి ఒమన్ వెళ్లాడు. గురువారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తుందని తోటి కార్మికులకు తెలిపాడు. వెంటనే అనంతయ్యను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని మృతుడి అన్న వెంకన్న ఇంటికి చేరవేయగా కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య అమృత, కూతురు ఉంది. ఒమన్ నుంచి మృతదేహాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వగ్రామానికి తెప్పించే ఏర్పాట్లు చేయాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ అమరగొండ తిరుపతిగౌడ్ కోరారు.

బీఎంఎస్ పోరాటంతో పరీక్షకు అనుమతి

శ్రీరాంపూర్: సింగరేణి ఇంటర్నల్ వెల్ఫేర్ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్‌లో కంపెనీ పెట్టిన విద్యార్హతపై తాము న్యాయపోరాటం చేస్తేనే ఎంబీఏ (హెచ్‌ఆర్‌ఎం) విద్యార్హత కలిగినవారికి అర్హత లభించిందని బీఎంఎస్ కేంద్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (హెచ్‌ఆర్‌ఎం) విద్యార్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోగా కంపెనీ ముందుగా వారిని పరీక్షకు అనుమతించలేదని పేర్కొన్నారు. దీనిపై తాము కంపెనీ డైరెక్టర్లు, సీఎండీకి లేఖ రాయగా వారు పట్టించుకోకుండా.. హాల్ టికెట్లు ఇవ్వకుండా ఈ నెల 21న పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. దీనిపై తాము కేసు వేయగా శుక్రవారం హైకోర్టు అనుమతి ఇవ్వాలని ఆదేశించిందని పేర్కొన్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్నవారికి అనుమతి లభించిందని తెలిపారు.

ధాన్యం కొనకుంటే చర్యలు


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజలింగు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'మా వడ్లు ఎందుకు కొనరు?' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. కొనుగోళ్లలో తమపై వివక్ష చూపుతున్నారని డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరుపై నిరసన తెలిపిన దళిత రైతుల ఆవేదన 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు శుక్రవారం కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యాన్ని సీరియల్ ప్రకారం కాకుండా ఇష్టారాజ్యంగా కొనుగోలు చేయొద్దని నిర్వాహకులను హెచ్చరించారు. దళిత రైతు బెడ్డెల శ్రీనివాస్‌తో మాట్లాడిన తహసీల్దార్ వెంటనే అతడి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించగా సాయంత్రం తూకం వేశారు. మరోసారి కొనుగోలు కేంద్రంలో తూకం, తరుగు, తాలు–తప్ప, బార్దాన్ తదితర సమస్యలు ఉత్పన్నమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రక్షణ నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిలో వినియోగించే వాహనాలు, యంత్రాలపై పని చేసే ఆపరేటర్లు రక్షణ నియమాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్ సూచించారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహిస్తున్న వాహనాలపై పని చేసే ఉద్యోగుల భద్రత అవగాహన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం గనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇటీవల వాహన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, సేఫ్టీ డీజీఎంలు ఏ శ్రీధర్‌రావు, రామనాథం, ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కులవార్, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి శంకర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్రశేఖర్, టీబీజీకేఎస్ నాయకులు మంద మల్లారెడ్డి, కందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూటన్నెల్‌తో ఉత్పత్తి సులభతరం


గనిపై సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

కాసిపేట: న్యూటన్నెల్‌తో ఉద్యోగులకు దూరభారాన్ని తగ్గించి ఎస్‌డీయల్ యంత్రాల ద్వారా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించి సీహెచ్‌పీకి రవాణా చేయడం సులభతరం అవుతుందని మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏరియాలోని కాసిపేటగని–1ఏ న్యూటన్నెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 హెచ్‌పీ సర్ఫేస్ హాలర్, బంకర్, 1000 కేవీఏ సబ్‌స్టేషన్‌ను టన్నెల్ వద్ద ప్రారంభించి మాట్లాడారు. కాసిపేట గని కార్మికులకు టన్నెల్ ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఉత్పత్తి, ఉత్పాదకతలు మెరుగుపడి పాతరోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తంజేశారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో ఉత్పత్తి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ అల్లావుద్దీన్, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని రక్షణాధికారి సునీల్‌కుమార్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీశాన్, నాయకులు వొడ్నాల రాజన్న, సోల్లంకి శ్రీనివాస్, ఉద్యోగులు, అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్సార్పీ–3 గనిలో కార్మికుడికి గాయాలు


గాయాలపాలైన గోపతి రవి

శ్రీరాంపూర్: ఎస్సార్పీ–3, 3ఏ గనిలో జరిగిన ప్రమాదంలో గోపతి రవి అనే బదిలీ వర్కర్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం రెండో షిఫ్ట్‌లో ఈ ప్రమాదం జరిగింది. రవితో పాటు బొడ్డు అశోక్ (సపోర్ట్‌మన్), తిరుపతి (బదిలీ వర్కర్) గని భూగర్భంలోని 20 1/2 లెవల్, 3 ఎస్పీ–2 డిస్ట్రిక్ట్, 3 సీమ్‌లో పని చేస్తున్నారు. సైడ్‌కు మెస్ వేస్తుండగా ఒక్కసారిగా పైకప్పు నుంచి బొగ్గు పెళ్ల కూలి వీరి మీద పడింది. ఈ ప్రమాదంలో రవి మోకాలు కింది భాగం విరిగిపోయింది. మిగతా ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. వెంటనే రవిని తోటి కార్మికులు ఉపరితలానికి తీసుకువచ్చారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, గని పిట్ సెక్రటరీ రిక్కుల గోపాల్ గనికి చేరుకుని అప్పటికే వచ్చిన కంపెనీ అంబులెన్స్‌లో రవిని చికిత్స కోసం రామకృష్ణపూర్‌లోని ఏరియాస్పత్రికి తరలించారు. కంపెనీ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మేనేజర్ సంతోష్‌కుమార్, సేఫ్టీ అధికారి మహేందర్ గనిలోకి దిగి ప్రమాదస్థలిని పరిశీలించారు.

వేతన ఒప్పంద చర్చలు సఫలం

- 25శాతం అలవెన్స్ పెంపుపై అంగీకారం
- నేడు కూడా కొనసాగనున్న చర్చలు
- పూర్తి స్థాయిలో అగ్రిమెంట్ రూపకల్పన
- ఫస్ట్ కేటగిరీ ఉద్యోగికి రూ.8వేల వరకు వేతనం పెంపు

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందంపై శుక్రవారం కోల్‌కత్తాలో జరిగిన 10వ దఫా జేబీసీసీఐ–11 చర్చలు సఫలమయ్యాయి. జాతీయ సంఘాలు, కోలిండియా యాజమాన్యానికి మధ్య సానుకూల ధోరణిలో చర్చలు జరగడంతో వేతన ఒప్పందం తుది దశకు చేరింది. ఈ చర్చల్లో 25శాతం అలవెన్స్‌ల పెంపునకు అంగీకారం కుదిరింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 3.2 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. అలవెన్స్‌ల పెంపుపై కుదిరిన అంగీకారం మేరకు శనివారం యాజమాన్యం రాతపూర్వకంగా(డ్రాఫ్టింగ్) ఇస్తే వెంటనే పూర్తి స్థాయిలో కార్మికల సంఘాలతో ఒప్పందం కానుంది. ఎనిమిదో దఫా వేతన ఒప్పంద చర్చల్లోనే 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్‌కు అంగీకారం కుదిరింది. ఇక మిగతా అలవెన్స్‌లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై తాజాగా చర్చలు జరిగాయి. కోలిండియా చైర్మన్ ప్రమోద్‌అగర్వాల్ అధ్యక్షతన జరిగిన చర్చల్లో సబ్సిడరీ కంపెనీ సీఎండీలు, సింగరేణి నుంచి డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం తదితరులు పాల్గొన్నారు. అన్ని అలవెన్స్‌లపై చర్చించి ప్రస్తుతం ఉన్నవాటిపై 25శాతం పెంపునకు యాజమాన్యం అంగీకరించింది. దీంతో వేతన ఒప్పందం చిక్కుముడి వీడిపోయింది.

- గతంలో జరిగిన అంగీకారం ప్రకారం 19శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్, ఇప్పటి 25 శాతం అలవెన్స్‌ల పెంపుతో సగటును ఫస్ట్ కేటగిరీ కార్మికుని వేతనం ఇప్పుడున్న వేతనంపై నెలకు రూ.8 వేల నుంచి రూ.9 వేలకు పెరిగే అవకాశం ఉందని చర్చల్లో పాల్గొన్న ఏఐటీయూసీ సభ్యుడు వీ.సీతారామయ్య తెలిపారు. ఇదే కేటగిరీ ఉద్యోగికి క్రితం 10వ వేజ్‌బోర్డులో రూ.4,890 పెరిగింది.
- జూలై, 1, 2021 నుంచి 11 వేతన ఒప్పందం అమలు చేస్తారు. దీని ప్రకారం లెక్కిస్తే జూనియర్ కార్మికునికి పెరిగిన వేతనం వల్ల రూ.2 లక్షలు, సీనియర్ కార్మికునిడికి రూ.4 లక్షల వరకు ఏరియర్స్ వస్తాయి.
- అలవెన్సులు మాత్రం ఒప్పందం అయిన తేదీ నుంచే అమలు అవుతాయి.

అంగీకారం కుదిరిన అలవెన్సుల వివరాలు

- అన్ని అలవెన్స్‌లు ప్రస్తుతం ఉన్న దానిపై 25 శాతం పెరుగుదల.
- స్పెషల్ అలవెన్స్ గతంలో నాలుగు శాతం ఉంటే ఇప్పుడు ఐదు శాతానికి పెంపు.
- అండర్‌గ్రౌండ్ అలవెన్స్ బేసిక్‌పై తొమ్మిది శాతం నుంచి 11.25 శాతానికి పెంపు.
- హెచ్‌ఆర్‌ఏ 2 శాతం నుంచి 2.5శాతానికిపెంపు
- నైట్‌షిఫ్ట్ అలవెన్స్ ఒక మస్టర్‌కు రూ.50 చెల్లిస్తారు.
- నర్సింగ్ అలవెన్స్ రూ.500 చెల్లిస్తారు.
- ఎల్‌టీసీ రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంపుదల.
- ఎల్ఎల్‌టీసీ రూ.12 వేల నుంచి రూ.15 వేలకు పెరుగుదల.
- లీవ్‌లో సిక్ విత్ పే విత్ 120 రోజుల నుంచి 150 రోజులు.
- కొత్తగా ఐదే మెటర్నిటీ లీవులకు అంగీకారం.
- పీహెచ్‌డీలు ఎనిమిది రోజుల నుంచి తొమ్మిది రోజులకు (ఇక నుంచి అంబేద్కర్ జయంతి పీహెచ్‌డీగా పరిగణిస్తారు).
- రిస్క్ అలవెన్స్‌పై స్టాండర్డైజేషన్ కమిటీలో నిర్ణయం.
- స్టడీ లీవ్ విత్ ఔట్ వేజెస్ ఇవ్వడానికి అంగీకారం.
- ఇప్పటివరకు లైవ్ రోస్టర్‌లో 18ఏళ్ల వచ్చే వరకు అబ్బాయిలకు మాత్రమే పెట్టేవారు. ఇప్పుడు అమ్మాయిలను కూడా లైవ్ రోస్టర్‌లో పెడతారు.
- ఉద్యోగి చనిపోతే, అతడి భార్య కూడా బతికి లేనప్పుడు వారి పిల్లలు లైవ్ రోస్టర్‌లో ఉన్నంత కాలం(18 సం) వారికి కూడా సగం వేతనం ఇస్తారు.
- డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ స్టాండర్డైజేషన్ కమిటీలో నిర్ణయిస్తారు. అప్పటి వరకు 10వ వేజ్‌బోర్డు లాగానే పరిగణిస్తారు. అంగీకారం కుదిరిన వీటిపై శనివారం జరిగే చర్చల్లో రాతపూర్వకంగా ఒప్పందం జరగాల్సి ఉంది.

21న పలు రైళ్ల రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 21న పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వేశాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే రైలు నంబర్ 17011, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే రైలు నంబర్ 17012, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు నంబర్ 17234, సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే రైలు నంబర్ 17233ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలని సూచించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వేస్టేషన్లో రైలు కింద పడి ఒకరు మృతి చెందారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం సాయంత్రం స్టేషన్‌కు కొంతదూరంలో పట్టాలపై పడి ఉన్న ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకుంటున్నాడు. ఇంతలో రైలు వస్తుండగా ప్లాట్‌ఫాం పైకి ఎక్కేందుకు యత్నించగా బల్లార్ష వైపు వెళ్లే రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు లభించలేదు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుంది. తెలుపు నీలిరంగు షర్ట్, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై దశరథ్ అని రాసి ఉంది. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. పూర్తి వివరాలకు 9490871784 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగం రాదేమోనని యువకుడి ఆత్మహత్య


నాగేందర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఉద్యోగం రాదేమోనని గ్రూప్–2కు ప్రిపేరవుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురంభీం జిల్లా దహెగాం మండలం పెద్దవనం గ్రామానికి చెందిన జాబరి బొంద్యాలు–లక్ష్మీబాయి దంపతుల నాలుగో కుమారుడు నాగేందర్ (22) మంచిర్యాలలోని హమాలీవాడలో గది అద్దెకు తీసుకుని గ్రూప్–2కు ప్రిపేరవుతున్నాడు. కష్టపడి చదువుతున్న తనకు ఉద్యోగం రాదేమోనని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో నాగేందర్ శుక్రవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగేందర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.